నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

# యాదాద్రి భువనగిరి

మంగళవారం 5 డిసెంబర్ 2023 | TUESDAY, DECEMBER 5, 2023 | YADADRI BHUVANAGIRI | పేజీలు PAGES : 8



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆ పార్టీ నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, మల్లయ్యయాదవ్ వెళ్లి తాజా పరిస్థితులపై చర్చించారు.



# ధాన్యం కొనుగోళ్లు.. 2.28 లక్షల మెట్రిక్ టన్నులు



## 24,686 మంది రైతుల నుంచి సేకరణ

పుష్కలంగా నీళ్లు, 24గంటల విద్యుత్, సర్కారు సహకారంతో రైతుల ఇంట సిరుల పంట పండుతున్నది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతున్నది. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో జిల్లా రైతాంగం 3,05,126 ఎకరాల్లో వరి సాగు చేయగా.. మొన్నటివరకూ ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 293 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లా అధికారులు పకడ్బందీ కార్యాచరణతో పని చేసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సాఫీగా నడిపించారు. అకాల వర్షాలతో కొంత సమస్య ఏర్పడినా ఆటంకాలు లేకుండా పూర్తి చేశారు. ఇప్పటివరకు 2,28,063 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి రూ.501.66 కోట్లు చెల్లించాల్సి ఉండగా, 358.23 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో కొనుగోళ్లు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. మరోవైపు యాసంగి సీజన్‌కు వ్యవసాయ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 3.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా, ఆ మేరకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)

- ఎప్పటికప్పుడు ఇబ్బందుల్లేకుండా కొనుగోలు
- అన్నదాతల ఖాతాల్లో రూ.358 కోట్లు జమ
- జిల్లాలో తుది దశకు కొనుగోలు ప్రక్రియ
- యాసంగి సీజన్ యాక్షన్ ప్లాన్‌కు అధికారుల కసరత్తు

మధ్య పేజీల్లో..

# కాంగ్రెస్‌లో పోరు షురూ..

## సీఎం కుర్చీ వివాదంలో కీలకంగా ఉమ్మడి జిల్లా సీనియర్లు

- రేవంత్‌కు వ్యతిరేకంగా ఉత్తమ్ లాబీయింగ్
- ఇప్పటివరకు ఉత్తమ్ వర్గానిదే పైచేయి
- చెరో దారిలో కోమటిరెడ్డి బ్రదర్స్
- ఉత్తమ్, వెంకట్‌రెడ్డి మధ్య అమాత్య పోరు
- రసవత్తరంగా జిల్లా కాంగ్రెస్ రాజకీయం

8లో..



అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఆస్వాదించక ముందే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో లొల్లి షురూ అయ్యింది. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలే కీలకంగా ఉండడంతో జిల్లా రాజకీయాలు సైతం రసవత్తరంగా మారాయి. ముఖ్యమంత్రి కుర్చీ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర వివాదం నెలకొంది. ఇందులో జిల్లా నుంచి సీఎం రేస్‌లో ఉన్న ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనదైన శైలిలో చక్రం తిప్పుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఎం కాకుండా అడ్డుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు చర్చ సాగుతున్నది. జిల్లాలోని కీలక నేతలు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. రేవంత్‌రెడ్డి అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పైచేయి కోసం పట్టు బిగించారు. ఈ క్రమంలో కోమటిరెడ్డి బ్రదర్స్ చెరోవైపు మొగ్గుచూపుతుండడం ఆసక్తికరంగా మారింది. సీఎం కుర్చీ కోసం సాగుతున్న పోరులో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలువగా, తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క టీమ్‌తో జతకట్టారు. ఉత్తమ్‌కు సీఎం ఛాన్స్ రాకపోతే జిల్లా నుంచి మంత్రులుగా ఉత్తమ్, కోమటిరెడ్డిలో ఎవరో ఒకరా.. లేదా ఇద్దరూ ఉంటారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)

# హైవేపై అగ్ని కీలలు

- నల్లగొండ శివారులో అర్ధరాత్రి ట్రావెల్స్ బస్సు దగ్ధం
- గాఢ నిద్రలో ఉన్న ఒకరి సజీవ దహనం
- అద్దాల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు



పూర్తిగా దగ్ధమైన ట్రావెల్స్ బస్సు

6లో..